# ౯. గంధం వొలుపు వేలుపు

శ్రీ సింహాచల స్వామి ఆది వరాహ స్వామి అయినా, నాలుక చివరకు వచ్చేసరికి 'సింహాది రప్పన్న', 'సింహాది రప్పన్న' అని అనెయ్యబుద్ధి వేస్తుంది. అదేమిటో ? 'అప్పన్న' శబ్దం ఇది అచ్చ తెనుగ్గా కూడా తోస్తుంది. అయినప్పటికీ ఈ శబ్దాన్ని తీసుకుపోయి చాలా మంది "నరసింహం" తో ముడెట్టి 'అప్పల్నరసింహం' అని వ్రాసుకుంటారు. 'అప్పన్న నరసింహం' అని కూడా కాదు. మొత్తంమీద బాగా ఆలోచించి చూస్తే సంస్కృతం మీద ఆంధ్రం బాగా నెత్తెక్కి ఆడిన రోజుల్లో 'అప్పన్న' అనే శబ్దం 'ఆది వరాహ స్వామి'కి జతపడి వాటి నన్నింటినీ దిగమ్రింగి తానే కొండకు కొమరై పోయినట్లు కనిపిస్తూంది. కాకపోతే పాటల్లో కూడా మేళవింపుగా అతుక్కుపోయి, 'సిమ్మాదిరప్పన్న సేవలే సేదాము' అని అంటూ ఆంధ్రలోకం ఈ మచ్చుగా తాండవింపనేరదు.

ఈ 'అప్పన్న' ఏం చేశాడయ్యా ఇంత కీర్తి సంపాదించడానికి అనే విషయం కూడా ఆలోచించవలసిందే. అప్పన్న అంటే మనిషీ కాదు దేవుడూ కాదు. నిజానికి పట్టి చూస్తే, అతడు అచ్చోసిన ఆంబోతు. దాన్నే కొన్ని చోట్ల తోట పెద్దు !" అని ప్రాంతీయంగా వాడుతూ వుంటారు. అచ్చోసిన ఆంబోతంటే వేఱే వర్ణించాలా ? నిగ నిగలాడే ఎత్తైన మూపురం, గణగణలాడే చిరుగంటలు, ఆ చిరుగంటల్లో రింగులోను

కొంటూ వ్రేలాడుతూ వుందా అన్నంత శోభస్కరంగా కానవచ్చే గంగ డోలు, ఖచ్చితమైన పుచ్ఛం, సుముఖమయిన ముఖం, నొష్టను పసుపు, పిట్టల్ని ముద్రలు, ఇంకా ఇంకా చెప్పరాని సింగారం ఎంతో వొలికించేస్తూ వుంటుంది. గుఱ్ఱం ఏమిటి, గొఱ్ఱేమిటి, ఇఱ్ఱేమిటి, జఱ్ఱేమిటి, ఏ జంతువైనా వయస్సొచ్చి స్వైరంగా తిరుగుతూ వుంటే చూడ ముచ్చటేస్తుంది. అందులో మన అప్పన్న ఆంబోతు కూడాను. అంటే పెద్దావుకు పుట్టి చిన్నావును ప్రేమించే ధీరోదాత్త నాయకుడాయిరి ! గొప్పగా కనిపించడు మఱీ ! అందఱి దృష్టి ఆకర్షించేస్తాడు ఒక్కొక్క సమయాన్ని అంకె వేశాడా అంటే ! ఒక్కసారి కొమ్ముల్తో తొలకరి తడీ పొడీ మట్టి రెమ్మేశాడా అంటే !

ఇటువంటి స్వైర విహారి అయిన ఆంబోతుకూ, ఒక్క చోట బుద్ధిమంతతనంగా వెలిసిన ఆదివరాహస్వామి వారికీ పరిచయం ఎలా కలిగిందీ అనేది మిక్కిలి తఱచి తెలుసుకో దగ్గ విషయమే !

వరాహనరసింహులు వారు సింహాచలం కొండను వెలిసి విలసిల్ల డానికి మహత్తర కారణాలు రెండు గనిపిస్తాయి. ఒకటి మత్స్యావతారమైనాక, కూర్మావతారం, కూర్మావతారమైనాక వరహావతారాం, అది అయినాక నరసింహావతారం—అవతారాలు పదీ కూడా మన భారత వర్షంలో తమతమ స్థానిక బలాలు నిర్ధారణ చేసుకోవడంలో కొంతవాడిచూపు విని యోగించాయి అని నా తాత్పర్యం. మత్స్యావతారం భూమ్మీద నిల్చే అవతారం కాదు. అయినప్పటికీన్నీ అది భారత వర్షభూఖండాన్ని సుప్తి వంతమై హిమవత్పర్వతం క్రింద అస్థిపంజర ప్రసిద్ధిని విలసిల్లుతూ వుందని నా నిశ్చితాభిప్రాయం. మఱి కూర్మావతారం శ్రీ కూర్మంలో మనందఱికీ కనబడుతూనే వుంది. దిగువకు ఆలా ప్రయాణించేస్తూ

వెతుక్కుంటూ వస్తే సింహచలంలో వరహావతారం నరసింహావతారం కూడా గోచరిస్తూ వున్నాయి. ఇంతవరకూ వివరిస్తే చాల్ననుకొంటాను ప్రకృతమ్మట్టుకు.

ఆ అవతారమూర్తులు రెండూ సింహచలాన్నే ఆశ్రయించి కనబడ్డ మేమా అంటే, అవి రెండూ ఉగ్రమూర్తులే. అంచేత రెండూ కూడా మిక్కిలి చల్లని తావును కోరుకొంటూ సఖ్యంగావొక్క చోటనే సన్నని సెలయేటిధారలు పన్నీటి జల్లుల్లా పడుతూవుండే ఆ కొండను వెలిసినాయి. వెలిసి మూర్తీభవించినాయి.

ఆసలు వొక్కొక్క అవతారం విడివిడిగా సాక్షాత్కరిస్తేనే పట్ట రాని సంతోషంతో పైని ముక్కోటి దేవతలూ క్రింద ముప్పదికోట్ల మానవులూ పూల వర్షం గురియిస్తూ, దీపారాధనగావిస్తూ, ధూపంవేస్తూ, తమలో తాము హర్షించిపోతారు గదా; అలాంటప్పుడు అవతారద్వయం వెలిసినచోట అంత పూజాపురస్కారం జరగనై యుండాలి చెప్పండి; అందులోనూ అవి రెండూ వుగ్రమూర్తులై నప్పుడు వాటికి శాంతి యినుమ డింపచేయాలీ అంటే ఏంచెయ్యాలి చెప్పండి ?

అదే పుయ్యడం ఆ విగ్రహానికి మంచి గంధం! రాత్రిళ్ళు దేవతలు పూసి, పగలు మానవులు పూసి నిక్షేపంగా కాలక్షేపం గావిస్తూ వచ్చినారు.

పూలపూజ, కర్పూర నీరాజనారాధన, అగరుధూపసేవ, జరిగి నప్పుడు అంత చలించలేదు గాని విగ్రహం, గంధం పూతజరిగినపుడు మాత్రం చలించింది. పూవులు వాడిపోయి గాలి కెగిరిపోవడానికి అవ కాశంవుంది; దీపారాధన కొంత సేపటికి కాకపోతే కొంత సేపటికైనా

పెద్దదవడానికి సావకాశంవుంది. ఒంటికి పూసినగంధం ! అది ఎలా వొదిలి పోవడం ? అది ఆరితే మరింత బిగిసిపోవడమే కాకుండా పూత మీదపూత, పూతమీదపూత, నఖశిఖపర్యంతం పట్టిస్తూ వుంటే రోమ కూపాలు పూడిపోయి ఇదిపువ్వా ? స్వామివిగ్రహమా ?' అని అనిపించి వేసింది కొన్నాళ్ళకు.

అయినాగానీ మానవులు మూర్ఖులు ! అంతకన్నా మూర్ఖులు దేవతలు ! అదే పనిగా చందనంతీసి, ఆ విగ్రహానికి అమేషారాస్తూ వుండడమే తమ వుద్యోగం అనుకున్నారు. అనుకుని, ఎంత దళసర్శో చెప్ప లేనంత దళసర్ని. నిమ్నోన్నతాలు లేకుండా విగ్రహాన్ని చందన గర్భితం చేసి పారేశారు.

స్వామికప్పు డనిపించించి. "ఏమిరా ! యీ మానవులు దేవతలూ కూడా యింత మతి పోయిన వాళ్లైనారు ? నా రూపాన్ని వారి అర్చనలో చూడలేక పోవడమే మహదాశయంగా పెట్టుకు పనిచేస్తూవున్నట్టు గోచరిస్తున్నారు. వాళ్ళకంటె బుద్ధిమంతులు మఱిలేరా యీ భూమ్మీదను ? అని కించిన్నిమీలిత నేత్రుడై ఆలోచించారు స్వామివారు.

వర్షము గురిసి వెలిసిన వోరాత్రి అది. మఱి తెల్లాఱితే వైశాఖ మాసం వస్తుంది. మూలకు నెట్టబడ్డ వెన్నెలకుప్ప అయిందీ, స్వామి వారి చందన స్వరూపం అయిందీ, తేటపడక ప్రజలూ దేవతలూ అల్లాడి పోతూవున్నారు.

అట్టి తరుణంలో మనచక్కని ఆంబోతు ఒంకెవేసి కొంటూ, తన లోంచి పుట్టుకొచ్చిన వుత్సాహంకొద్దీ, స్వామివారిని చేరి తన డెక్కతో

ఆలా ఆలా రాచి తన కొమ్ముల్తో ఇలా అలా కెక్కరించి గంధం లోకు లకు కాకులకు విరజిమ్మేసింది.

'అడుగో స్వామి ! అక్కడున్నాడు ! మనం కానక పోయినాం' అని ప్రజలు మూగిపోయినారు. పైని అజరులు తూగిపోయినారు.

"ఆంబోతు" అనడం మానేసేసి 'అంబన్న' 'ఆపన్న' 'అప్పన్న' ఆలాగ్గా అనడం మొదలుపెట్టినారు. తమకు దివ్యంగా దేవుని పునర్దర్శనం కలిగించిన ఆనలుగాళ్ళదాన్ని తాళాలతో తప్పెట్లతో పూరేగించారు. సింహాదిరప్పన్న సేవలేచేసేరు ! అది ఆదిగా ఏటేటా స్వామి గంధం వొలుపు ! ఇదీ ఏతద్వృత్తాంతం !

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
| --- | --- | --- |
| 24-2-1937 | సింహాచలం | "ఆంధ్రభూమి"లో |